
**డీజేలకు నో..** 2





**జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం..** 2

AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatodaynews.com


## నీటిపారుదల డివిజన్–4 ఈఈగా వెంకటేశ్వర్లు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి నీటిపారుదల డివిజన్ నెం.4 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా వెంకటేశ్వర్లు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తానని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న నీటిపారుదల పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తానన్నారు. కాగా వెంకటేశ్వర్లు గతంలో ఎల్లారెడ్డి నీటిపారుదల శాఖలో డీఈగా విధులు నిర్వహించారు. బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో డివిజన్ అధికారులు, సిబ్బంది పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.



## నీటి వనరులు వృథా కాకుండా చూడాలి




**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** జిల్లాలో అందుబాటులో ఉన్న నీటి వనరులు వృథా కాకుండా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం కలెక్టర్ భవేష్ మిశ్రాతో కలిసి వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. వివిధ జలాశయాలలో అందుబాటులో ఉన్న నీటి నిల్వల గురించి ఇరిగేషన్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గత ఏడాదితో పోలిస్తే శ్రీరాంసాగర్ సహా ఇతర ప్రాజెక్టులలో అతి తక్కువ నీటి నిల్వలు అందుబాటులో ఉన్నాయన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఎక్కడ కూడా చుక్క నీరు సైతం వృథా కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి అవసరాలకు నీటిని నిలువ ఉంచుతూ, పంటలను కాపాడేందుకు వీలుగా రెండు తడుల వరకు సాగు నీటిని విడుదల చేయాలని నిర్ణయించామన్నారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో ఉంటూ రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని అన్నారు. ఖరీఫ్ పంట సేకరణకు ఇబ్బందులు లేకుండా గోడౌన్‌లలో నిలువ ఉన్న బియ్యం నిల్వలను వేగంగా తరలించాలని సూచించారు. ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, డీఆర్వో గీత, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, డీఆర్డీవో సాయన్న పాల్గొన్నారు.

## వ్యవసాయ విద్య బలోపేతానికి చేస్తున్న కృషి అభినందనీయం



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** రాష్ట్రంలో వ్యవసాయ విద్యను బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ అన్నారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా గురువారం ఆయన అసెంబ్లీలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వమన్నారు. కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట్ మండలం మాల్తుమ్మెదలో 2014లో ఏర్పాటు చేసిన వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలను విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటం, వసతుల మెరుగుదల కోసం తాత్కాలికంగా సిద్ధిపేట జిల్లా తొర్నాలకు తరలించిన విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కామారెడ్డి జిల్లాలోని, ముఖ్యంగా ఎల్లారెడ్డి ప్రాంతానికి చెందిన రైతు కుటుంబాల పిల్లలు వ్యవసాయ విద్యకు దూరం కాకుండా ఉండేందుకు, నాగిరెడ్డిపేట్ మండలం మాల్తుమ్మెదలో ఉన్న సీడ్ ఫార్మ్‌లోనే పూర్తి స్థాయి వసతులతో వ్యవసాయ పాలిటెక్నిక్‌ను తిరిగి ఏర్పాటు చేయాలని కోరినట్లు చెప్పారు.

## ఆర్మూర్‌లో నకిలీ వైద్యుడి అరెస్ట్

**అక్షరటుడే,ఆర్మూర్:** వైద్యం చేయడానికి ఎటువంటి అర్హత లేకున్నా డాక్టర్‌గా చలామణి అవుతున్న ప్రియాంక క్లినిక్ యజమాని సమీర్ రాయ్‌ను ఆర్మూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆర్మూర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో ఎన్. రవీందర్ ఫిర్యాదు మేరకు ఆర్మూర్ ఎస్సై యాసీర్ అరాఫత్ దర్యాప్తు చేపట్టి, నిందితుడిని గురువారం అరెస్ట్ చేశారు. అనంతరం న్యాయస్థానంలో హాజరుపరచగా, న్యాయస్థానం ఆదేశాల మేరకు నిజామాబాద్ కేంద్ర కారాగారానికి తరలించారు. ఇటీవల ఆర్మూర్ పట్టణంలోని జిరాయత్ నగర్‌లోని ప్రియాంకా క్లినిక్‌లో వైద్యం చేయించుకున్న ఓ వ్యక్తికి వైద్యం వికటించడంతో నిజామాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ సందర్భంగా ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ.. ప్రజలు వైద్యం చేయించుకునే ముందు వైద్యుడికి అర్హతలు ఉన్నాయో లేదో నిర్ధారించుకోవాలని, నకిలీ వైద్యుల వద్ద చికిత్స పొంది ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సూచించారు.

**జిల్లాలో నిషేధిత భూముల జాబితాలో ప్రైవేట్ ఆస్తులు, భూములు చేరడం వాటి యజమానులను అయోమయానికి గురిచేస్తోంది. అత్యవసరానికి.. చదువులు, వివాహాల కోసం తమ స్థిరాస్తి, భూములను విక్రయించుకోవాలనుకునే వారికి తలనొప్పిగా మారింది. తమ భూములు 22ఏ నిషేధిత జాబితాలోకి వెళ్లడంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అయితే భూముల రిజిస్ట్రేషన్లలో మాత్రం సబ్‌రిజిస్ట్రార్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలున్నాయి.**

*- అక్షరటుడే, బోధన్*




# 22–ఏతో భయం.. భయం..

- బోధన్ డివిజన్‌లో నిషేధిత జాబితాలో భూములు
- క్రయవిక్రయాలు జరపలేక అవస్థలు
- అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడుతున్న రిజిస్ట్రార్లు
- అధికారులు స్పందించాలని ప్రజల వేడుకోలు

జిల్లాలోని బోధన్ పట్టణంలో పలు కాలనీల్లో భూములు, ఇళ్ల స్థలాలు 22ఏ నిషేధిత జాబితాలో వెళ్లినట్లుగా తెలుస్తోంది. పట్టణంలోని శక్కర్‌నగర్, ఆచన్‌పల్లి, వెంకటేశ్వరనగర్, రాకాసీపేట్ తదితర కాలనీల్లో స్థలాలు, ఇళ్లను నిషేధిత జాబితాలో చేర్చినట్లుగా సమాచారం. ఆయా కాలనీల్లో ప్రజలు తమ ఇళ్లు, స్థలాలు 22ఏలోకి వెళ్లాయని తెలుసుకుని షాక్‌కు గురయ్యారు. అసలు ఏమిటీ 22ఏ జాబితా ఇందులోకి తమ ఇళ్లు ఎందుకు వెళ్లాయని లబోదిబోమంటున్నారు..

### బెల్లాల్ ప్రాంతంలో..

బోధన్ పట్టణంలోని బెల్లాల్ రోడ్‌లో ఉన్న సర్వే నంబర్ 258లో భూమిని నిజాం షుగర్స్ వద్ద నుంచి పోలీస్ హౌసింగ్ సొసైటీ కొనుగోలు చేసింది. ఈ సర్వే నంబర్‌లో సుమారు 250కి పైగా ఇళ్లు, స్థలాలు ఉన్నాయి. అయితే విస్తుపోయే విషయమేమిటంటే ఈ సర్వే నంబర్‌లోని పోలీస్ కాలనీ మొత్తం నిషేధిత జాబితాలో చేరినట్లుగా రికార్డులు చెబుతున్నాయి. దీంతో ఏం చేయాలో తోచక బాధితులు ఆందోళన చెందుతున్నారు. పట్టణంలోని వెంకటేశ్వర కాలనీ, పట్టణం చుట్టు పక్కన మండలాల్లోని భూములు సైతం ఈ జాబితాలోకి వెళ్లాయి. ఈ జాబితాలోకి వెళ్లిన స్థలాలు, ఇళ్ల క్రయవిక్రయాలను ప్రభుత్వం నిషేధించింది. దీనిపై క్లారిటీ ఇచ్చే నాథుడు లేకపోవడంతో చాలామంది కలెక్టరేట్‌కు వెళ్తున్నారు. అక్కడ సమస్య పరిష్కారం కాక ఆందోళన చెందుతున్నారు.


### అసలు ఏమిటీ 22ఏ జాబితా..

రిజిస్ట్రేషన్ల చట్టం 1908లోని సెక్షన్ 22ఏ ప్రకారం.. ప్రభుత్వం కొన్ని భూములను ఎవరూ కొనకుండా.. విక్రయించకుండా రిజిస్ట్రేషన్‌కు అవకాశం లేకుండా నిషేధిత జాబితాలో పెడుతుంది. ప్రభుత్వాలు ప్రజా ఆస్తులను రక్షించేందుకు ఈ అస్త్రం ప్రయోగిస్తుంది. అయితే ఇక్కడ వచ్చిన చిక్కు ఏమిటంటే సాధారణ ప్రజలు భూములు, ఇళ్లు సైతం ఈ జాబితాలోకి చేరాయి. ఇటీవల రికార్డుల డిజిటలైజేషన్ (ధరణి నుంచి భూభారతి వ్యవస్థకు మార్చే క్రమంలో), కొన్ని సాంకేతిక కారణాలతో సాధారణ పట్టా భూములు, ఇళ్లు సైతం ఈ జాబితాలోకి వెళ్లినట్లు సమాచారం.

### రిజిస్ట్రార్ కార్యాలయానికి కాసుల పంట..

'22ఏ నిషేధిత జాబితా'ను అడ్డుపెట్టుకుని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు దోచుకుంటున్నాయని పలువురు బాధితులు ఆరోపిస్తున్నారు. క్రయవిక్రయాల నిమిత్తం రిజిస్ట్రేషన్ ఆఫీస్‌కు వెళ్లిన దరఖాస్తుదారుడు పక్కా లింక్ డాక్యుమెంట్లు సబ్మిట్ చేసినప్పటికీ సదరు భూమి నిషేధిత జాబితాలో ఉంది.. రిజిస్ట్రేషన్ చేసేది లేదంటూ మొదట సబ్ రిజిస్ట్రార్లు మొకాలడ్డు వేస్తున్నారు. అనంతరం బ్రోకర్లు రంగప్రవేశం చేసి వారిరువురి మధ్య బేరసారాలు కుదుర్చి గుట్టుగా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. సాధారణ వ్యక్తులకు మాత్రం సవాలక్ష కొర్రీలు పెడుతున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

## డ్రగ్స్ అక్రమ రవాణాతో సంపాదించిన ఆస్తులు జప్తు..: సీపీ




**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో డ్రగ్స్ అక్రమ రవాణాతో సంపాదించిన ఆస్తులను జప్తు చేస్తున్నామని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన వివరాలు వెల్లడించారు. ఆల్ప్రాజోలం వంటి మత్తు పదార్థాల అక్రమ తయారీ, రవాణా, సరఫరా, విక్రయాలకు పాల్పడుతున్న వ్యక్తులపై పోలీస్ శాఖ కఠిన చర్యలు చేపడుతోందని సీపీ పేర్కొన్నారు. నిజామాబాద్ ఏసీపీ బి. ప్రకాష్ పర్యవేక్షణలో రూరల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, నిజామాబాద్ ఈగల్ టీమ్ ఆధ్వర్యంలో చేపట్టిన దర్యాప్తులో అంతర్రాష్ట్ర ఆల్ప్రాజోలం అక్రమ సరఫరా నెట్‌వర్క్‌ను ఛేదించామని సీపీ తెలిపారు. నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆల్ప్రాజోలం అక్రమ సరఫరాకు పాల్పడుతున్న ఐదుగురు అంతర్రాష్ట్ర డ్రగ్ స్మగ్లర్లపై ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి నలుగురిని అరెస్ట్ చేసి జైలుకు పంపామన్నారు. వారి వద్ద నుండి సుమారు 1.087 కిలో గ్రామ్స్ ఆల్ఫ్రాజోలం స్వాధీనం చేసుకున్నామని.. దాని విలువ సుమారు రూ.4.50 లక్షలు ఉంటుందన్నారు. అలాగే రెండు కార్లు, 5 మొబైల్ ఫోన్లు, రూ.3.50 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. కేసు దర్యాప్తులో భాగంగా నిందితులను విచారించగా ఆల్ప్రాజోలం అక్రమ సరఫరాకు సంబంధించిన కీలక సమాచారం వెలుగులోకి వచ్చిందని.. వారి విచారణ, ఇతర ఆధారాల ఆధారంగా ఆల్ప్రాజోలం మాదకద్రవ్యాన్ని రాజస్థాన్ రాష్ట్రం నుండి మహారాష్ట్ర మీదుగా అక్రమంగా సరఫరా చేస్తున్నట్లు గుర్తించామని సీపీ తెలిపారు.

## అంకాపూర్‌లో మోడల్ మార్కెట్ ఏర్పాటు చేయాలి : రాకేష్ రెడ్డి



**అక్షరటుడే, ఆర్మూర్:** అంకాపూర్‌లో మోడల్ మార్కెట్ ఏర్పాటు చేయాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి కోరారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా క్వశ్చన్ అవర్‌లో ఆయన మాట్లాడారు. అంకాపూర్ గ్రామంలో మోడల్ కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేసి కూరగాయలు మార్కెట్‌కు తీసుకొచ్చే రైతులకు, వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అసెంబ్లీ వేదికగా కోరారు. నిత్యం వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు ఉంటాయని అలాగే తెల్లవారుజామున రెండు గంటల నుండి రైతులు కూరగాయల విక్రయాల కోసం పడిగాపులు కాస్తారని చెప్పారు. అంకాపూర్ నుంచి హైదరాబాదుకు బెంగళూరుకు కొత్తిమీర వంటి వాణిజ్య పంటలను ఎక్స్‌పోర్ట్ చేస్తారన్నారు. మొక్కజొన్న అమ్మకాలు ఏడాది పొడుగున జరుగుతాయని తెలిపారు. అంకాపూర్ అంటే దేశంలోని ఆదర్శ గ్రామమని, ప్రత్యేక గ్రాంట్ ద్వారా ఏడాదికి రూ.5లక్షల వస్తాయని వివరించారు. అంకాపూర్ గ్రామ అభివృద్ధి కమిటీకి సబ్సిడీ ద్వారా కోల్డ్ స్టోరేజ్ లాంటివి ఇవ్వడం ద్వారా అక్కడ స్థానికంగా ఉన్న రైతులకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. చుట్టుపక్కల రైతులు కూడా విశ్రాంతి గదులు లేక ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. మోడల్ కూరల మార్కెట్ వంటి వాటికి పైలెట్ ప్రాజెక్టు కింద అంకాపూర్‌ను ఎన్నుకోవాలని సూచించారు. గ్రామంలో పండించే పంటలను చూడడానికి నిత్యం వివిధ రాష్ట్రాల నుంచి అంకాపూర్‌ను సందర్శిస్తారని ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి అన్నారు. దీనికి మంత్రి స్పందిస్తూ సాధ్యాసాధ్యాలను పరిశీలించి ఏర్పాటు చేస్తామని అసెంబ్లీ వేదికగా తెలిపారు.

## గోదావరి పుష్కరాలను కుంభమేళా తరహాలో నిర్వహిస్తాం : సుదర్శన్ రెడ్డి



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** జిల్లాలో గోదావరి పుష్కరాలను కుంభమేళా తరహాలో నిర్వహిస్తామని ప్రభుత్వ సలహాదారు పి సుదర్శన్ రెడ్డి తెలిపారు. త్రివేణి సంగమమైన రెంజల్ మండలం కందకుర్తి, నవీపేట్‌లోని యంచ వద్ద కలెక్టర్ భవేష్ మిశ్రా తో కలిసి ఆయన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. వచ్చే ఏడాది జూన్, జూలై మాసాలలో జరిగే గోదావరి పుష్కరాల సందర్భంగా పుణ్య స్నానాల కోసం జిల్లాలోని వివిధ పుష్కర క్షేత్రాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. పుష్కర ఘాట్ల వద్ద సదుపాయాల కల్పన కోసం అవసరమైన అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. కందకుర్తి వద్ద నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో రూ. 6.05 కోట్ల అంచనా వ్యయంతో పుష్కర ఘాట్ నిర్మాణానికి, పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో రూ.3.90 కోట్ల నిధులతో రోడ్ల నిర్మాణాలకు, దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో రూ. 5 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. యంచ వద్ద రూ. 2.15 కోట్ల నిధులతో పుష్కర ఘాట్, రూ.70 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించారు. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, గోదావరి పుష్కరాలను కుంభమేళా తరహాలో అట్టహాసంగా నిర్వహించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నారని అన్నారు.

## ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించిన కలెక్టర్

**అక్షరటుడే,నిజామాబాద్ సిటీ:** జిల్లా కేంద్రంలోని వినాయకనగర్‌లో ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ భవేష్ మిశ్రా గురువారం అదనపు కలెక్టర్ భుజంగరావుతో కలిసి పరిశీలించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోడౌన్ సీల్‌ను తెరిచారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్‌లు, ఎన్నికల సామగ్రిని భద్రపరిచిన గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. సీసీ కెమెరాలు నిరంతరం పని చేసేలా చూడాలని, ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లు, ఇతర సామగ్రికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట అగ్నిమాపక శాఖ అధికారి శంకర్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజ్, సిబ్బంది సాత్విక్, విజయేందర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉన్నారు.



## కల్లడిలో డిజిటల్ క్రాప్ సర్వేకు శ్రీకారం..



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ మండలం కల్లడి గ్రామంలో డిజిటల్ క్రాప్ సర్వే కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ అధికారి రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. వ్యవసాయ అధికారి రాంబాబు మాట్లాడుతూ.. ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక వలంటీర్‌ను నియమించి, రైతుల వారీగా సర్వే నంబర్, సాగు చేస్తున్న పంట రకం, విస్తీర్ణం తదితర వివరాలను డిజిటల్ క్రాప్ సర్వే యాప్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. పంటల వివరాల నమోదు ప్రక్రియలో ఎలాంటి తప్పులు లేకుండా క్షేత్రస్థాయిలో పరిశీలన అనంతరం నమోదు చేస్తున్నామని పేర్కొన్నారు.డిజిటల్ క్రాప్ సర్వేకు సంబంధించిన సమాచారం రైతుల మొబైల్ ఫోన్లకు మెసేజ్‌ల రూపంలో పంపిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రైతు తమ పంట వివరాలను వ్యవసాయ శాఖ ద్వారా తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. పంట నమోదు పూర్తయితే ప్రభుత్వ పథకాలు, పంటల కొనుగోలు, పంటల ఆధారిత సేవలు తదితర కార్యక్రమాల్లో రైతులకు మరింత పారదర్శకతతో సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. రైతులు తమ పొలాల వివరాలను వ్యవసాయ సిబ్బందికి అందించి డిజిటల్ క్రాప్ సర్వేకు సహకరించాలని రాంబాబు కోరారు.

## ఆలూర్ వాసికి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూరుకు చెందిన ఇస్సపల్లి పోతన్నకు ఉస్మానియా యూనివర్సిటీ చరిత్ర విభాగం డాక్టరేట్ ప్రకటించింది. "మధ్యయుగ దక్కన్ పాలకులు సైనిక వ్యవస్థ (1000-1724)" అనే అంశంపై పోతన్న పరిశోధన జరిపారు. ఈ పరిశోధనకు ప్రొఫెసర్ జి.అంజయ్య గైడ్‌గా వ్యవహరించారు. ప్రస్తుతం పోతన్న తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్, భిక్కనూరు చరిత్ర విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్నారు. రైతు కుటుంబంలో జన్మించిన ఆయన ప్రాథమిక విద్యను ఆలూరులో, డిగ్రీని నిజామాబాద్ గిరిరాజ్ కాలేజీలో, పీజీ, పీహెచ్‌డీని ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తి చేశారు. తన విద్యాభ్యాసం మొత్తం ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే సాగిందన్నారు. డాక్టరేట్ పొందడం గొప్ప గౌరవంగా భావిస్తున్నానని తెలిపారు. తన విజయానికి సహకరించిన తల్లిదండ్రులు, గురువులకు రుణపడి ఉంటానన్నారు.

## చైల్డ్ ప్రొటెక్షన్ కమిషన్ ఛైర్‌పర్సన్‌ను కలిసిన ఉజ్వాలా ట్రస్ట్ ఛైర్మన్



**అక్షరటుడే, ఆర్మూర్:** చైల్డ్ ప్రొటెక్షన్ కమిషన్ ఛైర్ పర్సన్ సీతా దయాకర్‌ను గురువారం ఉజ్వాల ట్రస్ట్ ఛైర్మన్ శ్రీకాంత్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పిల్లల హక్కుల పరిరక్షణ, బాలల సంక్షేమం, బాలలపై జరుగుతున్న హింస, వేధింపులు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన వంటి అంశాలపై చర్చించినట్లు శ్రీకాంత్ తెలిపారు. సమాజంలో ప్రతి చిన్నారికి సురక్షితమైన వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు కూడా సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉజ్వాల ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను శ్రీకాంత్ వివరించారు. బాలల సంక్షేమానికి కమిషన్ చేస్తున్న కృషికి అభినందనలు, ధన్యవాదాలు తెలిపారు.

## డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం కావాలి




**అక్షరటుడే, బాల్కొండ:** డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై కృషి చేయాలని ఈగల్ ఫోర్స్ అడ్వైజర్ కొండవీటి శ్యాంప్రసాద్ కోరారు. బాల్కొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన యాంటీ డ్రగ్స్ అవేర్‌నెస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కొందరు స్వలాభం కోసం గంజాయి వంటి మాదకద్రవ్యాలను విక్రయిస్తూ యువత జీవితాలను నాశనం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజాన్ని పట్టిపీడిస్తున్న గుట్కా, గంజాయి వంటి మత్తు పదార్థాల నిర్మూలనకు మేధావులు, యువత ముందుకు రావాలని కోరారు. బాల్కొండ ఎస్సై శైలేందర్ మాట్లాడుతూ.. డ్రగ్స్ సేవించడం అనారోగ్యానికి దారితీస్తుందని, మాదకద్రవ్యాల వినియోగం వల్ల ఆరోగ్యం కోల్పోవడంతో పాటు చట్టపరంగా నేరస్తులుగా మిగిలిపోయే ప్రమాదం ఉందని వివరించారు. పాఠశాల హెచ్‌ఎం బట్టు రాజేశ్వర్ పాల్గొన్నారు.

జిల్లాలో గణేష్ నవరాత్రి ఉత్సవాల సందడి ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లా పోలీసులు అప్రమత్తమయ్యారు. శబ్ద కాలుష్యం కారణంగా వృద్ధులు, గర్భిణులు, నవజాత శిశువులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారంటూ దాఖలైన పిటిషన్లను పరిశీలించిన తెలంగాణ హైకోర్టు నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించిన నేపథ్యంలో పోలీసులు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించారు.

– అక్షరటుడే, ఎల్లారెడ్డి



# డీజేలకు నో..

■ గణేష్ ఉత్సవాలపై పోలీసుల ప్రత్యేక నిఘా.. ■ శబ్దకాలుష్యం చేస్తే కఠినచర్యలు.. ■ నిబంధనలు పాటించకుంటే కేసులే..

గణేష్ మండపాల వద్ద డీజేల ఏర్పాటుపై ప్రత్యేక నిఘా పెట్టనున్నామని పోలీసులు తెలిపారు. రాత్రి 10 గంటల తర్వాత భారీ శబ్దాలు చేయకుండా చర్యలు తీసుకుంటామని, పాఠశాలలు, ఆస్పత్రుల పరిసరాలను నోనాయిస్ జోన్‌గా పరిగణిస్తామని స్పష్టం చేశారు. నిబంధనలు పాటిస్తామని హామీ పత్రం ఇచ్చిన తర్వాతే మండపాలకు అనుమతులు మంజూరు చేస్తామని పోలీసులు చెబుతున్నారు.

### నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు..

ప్రధాన రహదారులు, కాలనీల్లో భారీ డీజేలు పెట్టి ఇబ్బంది కలిగిస్తే 112కు సమాచారం ఇవ్వాలని పోలీస్ శాఖ సూచించింది. నిబంధనలు ఉల్లంఘించే డీజేలను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ రాజేష్ చంద్ర హెచ్చరించారు. మద్యం మత్తులో చట్టాన్ని ఉల్లంఘిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. ఇప్పటికే ఉమ్మడిజిల్లావ్యాప్తంగా ఆయా ప్రాంతాల్లో డీజే నిర్వాహకులకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. పలువురిని తహశీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు.

### 'ఇంటిమేషన్' తప్పనిసరి

మండపాల వివరాలను ముందస్తుగా తెలియజేసేందుకు పోలీసు శాఖ ప్రత్యేక ఆన్‌లైన్ ఇంటిమేషన్ విధానాన్ని తీసుకువచ్చింది. నిర్వాహకులు http://policeportal.tspolice.gov.in వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసి సంబంధిత స్టేషన్‌కు దరఖాస్తు ఇవ్వాలి.

### మండప నిర్వాహకులకు..

పోర్టల్‌లో తప్పనిసరిగా వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. మండపం వద్ద కమిటీ పేర్లు, ఫోన్ నంబర్లు స్పష్టంగా ప్రదర్శించాలి. విద్యుత్ శాఖ అనుమతి తర్వాతే కనెక్షన్ తీసుకోవాలి. ప్రతి మండపం వద్ద సీసీ కెమెరాలు తప్పనిసరి. 24 గంటలు కనీసం నలుగురు వలంటీర్లు ఉండాలి. ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, నీరు, ఇసుక అందుబాటులో ఉంచాలి. శోభాయాత్రలో డీజేలు నిషేధం, భక్తి గీతాలు మాత్రమే ప్లే చేయాలి. ఇతర మతాలను కించపరిచే ఫ్లెక్సీలు, పటాకులు పేల్చడం నిషేధం. ఈ సందర్భంగా ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు జరుపుకునేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్పీ రాజేష్ చంద్ర కోరారు.



## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ మండలం పత్తేపూర్ గ్రామంలో ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి ఆదేశాల మేరకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. వేల్పూర్ గంగా సాగర్ రూ.2,25,000, వేల్పూర్ లహరి రూ.65,000, బత్తుల సుగుణ రూ.13,500, వేముల వెంకవ్వ రూ.12వేలు, బండారి శారదకు రూ.12 వేల చెక్కులను అందజేశారు. పత్తేపూర్ సర్పంచ్ ఏనుగు నాగరాజు, బీజేపీ శక్తి కేంద్ర ఇన్‌ఛార్జి గడ్డం తిరుపతి రెడ్డి, ఆర్మూర్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు సూరల చిన్నయ్య, బీజేపీ సీనియర్ నాయకులు బత్తుల వినోద్, మెల్ల గంగా మోహన్, దండుగుల నర్సయ్య పాల్గొన్నారు.



## టీఆర్ఎస్వీ నాయకుల అరెస్ట్..

**అక్షరటుడే, ఆర్మూర్:** ముందస్తు చర్యల్లో భాగంగా ఆర్మూర్ టీఆర్ఎస్వీ నాయకులను గురువారం పోలీసులు అరెస్టు చేసి ఆర్మూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని, కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని వారి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్వీ నాయకులు మీరా శ్రావణ్, షాహిద్, అగ్గు క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయానికి 16 గంటల విద్యుత్ అందించాలి




**అక్షరటుడే, ఆర్మూర్ :** పంటలకు 16 గంటలు విద్యుత్ సరఫరా చేయాలని రైతు నాయకులు కోరారు. ఆర్మూర్ పట్టణంలోని విద్యుత్ శాఖ డివిజనల్ కార్యాలయంలో ఏడీఈ కృష్ణకు రైతు సంఘం ప్రతినిధులు గురువారం వినతిపత్రం అందజేశారు. రైతులు సంఘము ప్రతినిధులు కలిగోట గంగాధర్, మగ్గిడి రాజేశ్వర్ మాట్లాడుతూ.. పంట పొలాలకు కరెంటును 16 గంటలు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు ఇబ్బందులు లేకుండా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు బొల్లు పోతన్న, డబ్బా లింగం, మల్లయ్య, ధర్మన్న తదితరులున్నారు.

## లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



**అక్షరటుడే, ఇందూరు:** లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్ ఆధ్వర్యంలో నగరంలోని రెడ్‌క్రాస్ సొసైటీలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. లయన్స్ క్లబ్ సభ్యులతో పాటు పలువురు యువకులు రక్తదానం చేశారు. నిజామాబాద్ రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ బుస్సా ఆంజనేయులు మాట్లాడుతూ రక్తదానం ఆవశ్యకతను వివరించారు. లయన్స్ జిల్లా అదనపు కోశాధికారి కరిపె రవీందర్, పి.రాఘవేందర్, చింతల గంగాదాస్, అంకం రాజేందర్, జైపాల్ కాలె, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వి.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## బాల్కొండలో డిజిటల్ పంట సర్వే



**అక్షరటుడే, బాల్కొండ:** రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ వలంటీర్ల సహకారంతో ఈ వానాకాలం సీజన్ నుంచి క్షేత్రస్థాయిలో డిజిటల్ పంట సర్వేను 100 శాతం అమలు చేస్తోందని బాల్కొండ మండల వ్యవసాయ అధికారిణి బద్దం లావణ్య తెలిపారు. గురువారం బాల్కొండ, వన్నెల్ (బి) శివార్లలో కొనసాగుతున్న డిజిటల్ పంట సర్వేను ఏఈవోలు రేష్మ, కావ్య క్షేత్రస్థాయిలో వలంటీర్లు, రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారిణి లావణ్య మాట్లాడుతూ.. బాల్కొండ క్లస్టర్ పరిధిలోని ప్రతి గ్రామంలో డిజిటల్ పంట సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతులు వలంటీర్ల సహకారంతో తమ పంట వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని సూచించారు. డిజిటల్ పంట సర్వే సెప్టెంబర్ నెలాఖరుకు పూర్తవుతుందని తెలిపారు. భవిష్యత్తులో మద్దతు ధరకు పంటల కొనుగోలు ఈ సర్వే వివరాల ఆధారంగానే జరిగే అవకాశం ఉన్నందున రైతులు సర్వే వాలంటీర్లకు అందుబాటులో ఉంటూ పంట వివరాల నమోదు సక్రమంగా జరిగేలా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వలంటీర్లు అజయ్, మహేష్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మకు ఘన నివాళి



**అక్షరటుడే, గాంధారి:** వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా మండలంలోని జువ్వాడి గ్రామంలో ఆమె విగ్రహానికి ఘన నివాళులు అర్పించారు. జువ్వాడి రజక సంఘ సభ్యుడు మచ్చర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ వీరనారి చాకలి ఐలమ్మ త్యాగాలు, పోరాట స్ఫూర్తిని నేటి తరానికి అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రతి గ్రామంలో చాకలి ఐలమ్మ విగ్రహాలను ఏర్పాటు చేసి రజకుల ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. ఐక్యంగా ముందుకు సాగుతూ రజకుల హక్కుల సాధన దిశగా ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని కోరారు. హక్కుల సాధన కోసం చైతన్యంతో ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, యువకులు రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం.. ఒకరు మృతి



**అక్షరటుడే, డిచ్‌పల్లి:** జాతీయ రహదారిపై గురువారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. డిచ్‌పల్లి మండల పరిధిలో 44వ జాతీయ రహదారిపై ఈ ఘటన చోటు చేసుకుంది. డిచ్‌పల్లి ఎస్సై ఆరిఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్మూర్ వైపు వెళ్తున్న డీసీఎం లారీ, కారు ఢీకొన్న ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఒకరు సంఘటన స్థలంలోనే మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమాచారం అందుకున్న హైవే సిబ్బంది క్షతగాత్రులను అంబులెన్స్‌లో నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడు నిర్మల్ జిల్లాకు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించినట్లు తెలిపారు. మృతుడు ఉపాధ్యాయుడని, తీవ్రంగా గాయపడిన వ్యక్తి రోదిస్తూ తెలిపినట్లు సమాచారం. ప్రమాదానికి గల కారణాలపై డిచ్‌పల్లి ఎస్సై ఆరిఫ్ దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదంతో జాతీయ రహదారిపై కొంతసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

## రైస్ మిల్లులపై దాడులు ఆపాలి



**అక్షరటుడే, కామారెడ్డి:** రైస్ మిల్లులపై ఫిజికల్ వెరిఫికేషన్ పేరుతో జరుగుతున్న దాడులను వెంటనే ఆపాలని ఆల్ ఇండియా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కార్యదర్శి మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. సీఎంఆర్ బియ్యం అప్పగించేందుకు డిసెంబర్ 31 వరకు గడువు ఇవ్వాలని కోరారు. కామారెడ్డి కలెక్టరేట్ వద్ద అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన మహాధర్నాలో ఆయన పాల్గొన్నారు. 1960 నుంచి రైస్ మిల్లు పరిశ్రమ ఉందని, 2014కు ముందు ప్రభుత్వానికి కావాల్సిన బియ్యాన్ని మిల్లుల్లోనే కొనుగోలు చేసేవారని గుర్తు చేశారు. పుణ్యానికి ధాన్యం ఇస్తే పందికొక్కుల్లా వ్యవహరిస్తున్నారని కొందరు మాట్లాడటం సరికాదన్నారు. ధాన్యం పేరుతో ఇష్టారాజ్యంగా దాడులు చేస్తూ వెరిఫికేషన్ పేరుతో మిల్లర్లను జైలులో పెడితే సహించేది లేదని హెచ్చరించారు. ధర్నాలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్, జిల్లా కార్యదర్శి సంతోష్, కోశాధికారి ముత్యపు సుదర్శన్, మాజీ అధ్యక్షుడు కంచర్ల లింగం, మాజీ కార్యదర్శి గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు

## నందిపేట్‌లో వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి



**అక్షరటుడే,నందిపేట్:** మండల కేంద్రంలో రజక ఐక్యవేదిక మండల అధ్యక్షుడు కుంటాల గవాస్కర్ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం, పోరాడిన వీర వనిత అని కొనియాడారు. నిజాం పాలన కాలంలో స్థానిక, దొరల అణిచివేతను, వెట్టి చాకిరిని ఐలమ్మ తీవ్రంగా ప్రతిఘటించారని, తన కుటుంబానికి సంబంధించిన భూమిని దొరలు లాక్కోవడానికి ప్రయత్నించినప్పుడు కొడవలి చేతపట్టి ప్రాణలకు తెగించి పోరాడారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి ఎంద్రాల చిన్న గంగాధర్, జేఏసీ గంగన్న, ఉమ్మెడ సంతోష్, రజక మండల ఉపాధ్యక్షుడు బాద్గుణ పెద్ద సాగర్, బాద్గుణ చిన్న సాయన్న, దేవన్న, సోర్పేట సాయన్న, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.